క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌సీపీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడిఈ విజయభాస్కర్ తెలిపారు. ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో దుర్గానగర్, పటేల్ నగర్, సునార్‌బౌలి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర స్పోక్స్ పర్సన్‌గా మురళి



నల్లకుంట: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర స్పోక్స్ పర్సన్‌గా నల్లకుంటకు చెందిన మురళి నియమితులయ్యారు. బుధవారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆయనకు నియామకపు పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, నగర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతం రావులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అంజయ్యకు ఘన నివాళి



ముషీరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన టంగుటూరి అంజయ్య 37వ వర్ధంతి బుధవారం లుంబిని పార్కులోని ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. మాజీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రాంచందర్‌రావు, వి.హన్మంతరావు, కేశవరావు, మాజీ ఎమ్మెల్యేలు కోదండరెడ్డి, పి.విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులు నివాళులర్పించారు.

ముషీరాబాద్ సమగ్ర అభివృద్ధికి కృషి

ముషీరాబాద్: ముషీరాబాద్ సమగ్ర అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తామని ధర్మసమాజ్‌పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల రాజేష్ పేర్కొన్నారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముత్యాల రాజేష్ మాట్లాడుతూ.... రాబోయే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ధర్మసమాజ్ పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజల తరుపున అగ్రకుల పార్టీలకు అభిముఖంగా ఎన్నికల బరిలో నిల్వనుందని తెలిపారు. 7శాతం లేని అగ్రకుల బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీల దుష్టవైఖరి, కుటిల రాజకీయాలను, మోసపూరిత హామీలను ఈ ఎన్నికల్లో ఎండ గడుతామన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గూడపర్తి సంతోష్, నగర ప్రచార కమిటీ సభ్యులు డి. కిరణ్‌కుమార్, జి. సాయిగోపాల్, నవీన్‌గౌడ్, బి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అధ్యాపకుల కొరతతో పార్ట్‌టైం అధ్యాపకుల నియామకాలకు నోటిఫికేషన్ వెలువడింది. క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ నిజాం కాలేజీ, ఇతర పీజీ కాలేజీల్లో వివిధ సబ్జెక్టులను బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా నియామకాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌కు ఈ నెల 26 దరఖాస్తులు, నిజాం కాలేజీలో కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఇన్ఫర్మేటిక్స్/ కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో బోధించేందుకు ఈ నెల 21 వరకు దరఖాస్తు స్వీకరించనున్నట్లు తెలిపారు.

నేడు కల్యాణోత్సవం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 46వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 19వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు పద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామని ఈఓ రాజేష్‌కుమార్, అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు తెలిపారు. బుధవారం ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలతో అలంకరించి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం 8.30 గంటలకు తిరుప్పావడ, రాత్రి 7 గంటలకు గరుడ వాహన సేవలు నిర్వహిస్తామన్నారు. చారుకేసి ఫైన్‌ఆర్ట్స్ సంస్థ ప్రతినిధి గోవింద్ లక్ష్మీపద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలతో పాటు శ్రీవారి కల్యాణాన్ని కనులారా వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.



మహంకాళి ఆలయంలో..



బాగ్ అంబర్‌పేట్‌లో ..



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి తదితరులు

వైభవంగా దేవీశరన్నవరాత్రి వేడుకలు



మహంకాళి ఆలయంలో అన్నపూర్ణదేవి అలంకరణలో..



శంకరమఠంలో వైష్ణవి అలంకరణలో శారదాంబ



న్యూ రామాలయంలో గాయత్రి దేవి అలంకరణలో సరస్వతి మాత

అంబర్‌పేట్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. బుధవారం అంబర్‌పేట నియోజకవర్గం అమ్మవారి ఆలయాలు, మండపాల వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మహంకాళి అమ్మవారి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనిమిచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి అభిషేకం హోమాలు ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ వేడుకలను ఆలయ కమిటీ ప్రతినిధులు శంకర్‌గౌడ్, జ్ఞానేశ్వర్ గౌడ్, దుర్గాప్రసాద్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, గిరిధర్‌గౌడ్, గడ్డం శ్రీధర్ గౌడ్ తదితరులు పర్యవేక్షించారు. బతుకమ్మ కుంటలో మైసమ్మ ఆలయంలో అమ్మవారు లలితదేవి ఆలంకరణలో భక్తులకు దర్శనిమిచ్చారు.

వైష్ణవిగా శారదాంబ

నల్లకుంట: శారదా శన్నవరాత్రి ఉత్సవాల్లో నాలుగవ రోజైన బుధవారం నల్లకుంట శంకరమఠంలో వైష్ణవి అలంకరణలో అమ్మవారు శారదాంబ అలంకారంలో దర్శనమిచ్చిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం మఠం ప్రాంగణంలో సహస్ర మోదుక గణపతి హోమము నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఆలిండియా రేడియో కళాకారుడు డీవీ మోహన కృష్ణ బృందంచే నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి ఆకట్టుకుంది.

న్యూ రామాలయంలో గాయత్రి దేవిగా సరస్వతి మాత

న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారాంజనేయ సరస్వతి ఆలయంలో సరస్వతి మాత గాయత్రి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కావించారు.

లలితాదేవి అలంకారంలో అమ్మవారు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండపంలో బుధవారం అమ్మవారు లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. నిర్వహకులు పలుసా బాలరాజ్‌గౌడ్, కందూరు కృష్ణ, తుమ్మన కృష్ణమూర్తి, రామకృష్ణగౌడ్‌లు అమ్మవారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

నల్ల పోచమ్మ దేవాలయంలో అన్నదానం

ముషీరాబాద్: దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయంఅలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్.మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, రవియాదవ్ పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

నల్లకుంట: అన్ని దానాల్లో కెల్ల అన్నదానం పుణ్యకార్యమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గ్రేట్ ఇండియా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం శంకరమఠం కూరగాయల మార్కెట్ రోడ్డులో అమ్మవారి మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శివ యాదవ్, చైతన్య కుమార్, సోమ సుందర్ పాల్గొన్నారు.





అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతాయి

అంబర్‌పేట్: ఆహ్లాదకర వాతవరణానికి మొక్కలు ఎంతో దోహదపడుతున్నాయని అంబర్‌పేట పోలీస్ స్టేషన్ ట్రైనింగ్ ప్రిన్సిపల్ పి.మధుకర్ స్వామి తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో మొక్కలు నాటే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసరాల్లో ఇతర పోలీస్ అధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్‌లు పిచ్చయ్య, జగన్, డీఎస్పీలు లక్ష్మీకాంత్, టి.లక్ష్మి, విజయకుమార్,శ్రీధర్‌రెడ్డి, ఏఓ రామరావు, ఆర్ఐ శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



అంబర్‌పేట పీటీసీలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ మధుకర్ స్వామి తదితరులు

వీఎస్ఆర్ ఇంటికి ముఠా గోపాల్



ముఠా గోపాల్‌ను శాలువాతో సత్కరిస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: అసంతృప్తిగా ఉన్న ఓ ఒక్క కార్యకర్త, నాయకుడిని నిర్లక్ష్యం చేయవద్దని వారి ఇంటికి వెళ్లి కలవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచన మేరకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్.. నాయిని నర్సింహ్మారెడ్డి అల్లుడు, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి నివాసానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, తనయుడు ముఠా జైసింహలు వెళ్లి కలిశారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన వి.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం అంబేద్కర్‌నగర్‌లోని సీనియర్ నాయకులు సిరిగిరి శ్యామ్ నివాసంలో తన అనుచరులతో కలిసి ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి ముఠా గోపాల్, ముఠా జైసింహలను ఆహ్వానించారు.

యువకుడి ఆత్మహత్య

నల్లకుంట: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్న సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శివ శంకర్ కథనం మేరకు.. ప్రైవేట్ ఉద్యోగి ఈసమ్ శివ కుమార్(27) గోల్నాక మార్కెట్ సమీపంలోని వెంకటేశ్వర నగర్‌లో నివాసముంటున్నాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అతను గత కొద్ది రోజులుగా నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సమీపంలో గల శ్రీ నవ్య గ్రాండ్ ఓయోలో ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఓయోలోని గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని శవ పంచనామ నిర్వహించి మృత దేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురికి తరలించారు. పోస్టు మార్టం అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి నర్సింగ్ రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎస్పీరోడ్‌లోని జురాస్ట్రియన్ క్లబ్ వద్ద ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వివరాలపై ఆరా తీశారు. మృతుడికి 35-40 ఏళ్లు ఉంటుందని నలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుడి చేతిపై మింటూ లాల్ అనే ట్యాట్ ఉందని సంబంధీకులు ఎవరైనా ఉంటే రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



ఫీవర్ చౌరస్తా వద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

నల్లకుంట: బీఆర్ఎస్ పార్టీ నల్లకుంట డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తాలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బతుకమ్మ వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్లు విజయ్ కుమార్ గౌడ్, బి. పద్మా వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ‘ఫీవర్’ ఆవరణలో వేడుకలు

నల్లకుంట: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్ఈయూ) ఆధ్వర్యంలో గురువారం(నేడు) నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఆవరణలో బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టీఎంహెచ్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోఖ్ తెలిపారు. బుధవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి టీఎంహెచ్‌యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ ఫీవర్ ఆసుపత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్యతో కలిసి అశోఖ్ బతుకమ్మ వేడుకల వివరాలను వెల్లడించారు. మధ్యాహ్నం 12 గంటలకు బతుకమ్మ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సంస్కృతికి నిలువెత్తు బతుకమ్మ సంబరాలు అని న్యూ ఏరా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని కళాశాల వద్ద బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులు డీజే సౌండ్స్, బతుకమ్మ పాటలతో కోలాటం వేస్తు అదరహో అనిపించారు.





అన్ని రాజకీయ పార్టీలు మాదిగ డిక్లరేషన్ ప్రకటించాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: అన్ని రాజకీయ పార్టీలు మాదిగ డిక్లరేషన్ ప్రకటించాలి, రాబోయే ఎన్నికల్లో మాదిగలకు 23 సీట్లు కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నవంబర్ 5వ తేదీన మాదిగల యద్ధభేరి పేరుతో చేపట్టిన చలో ఇందిరాపార్కు కార్యక్రమానికి సంబంధిన పోస్టర్, కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వంగపల్లి మాట్లాడుతూ డప్పు, చెప్పు వృత్తిదారులకు తక్షణమే 4 వేల పెన్షన్ ప్రకటించాలని, గత 10 సంవత్సరాల కాలంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులపైప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. కోర్ కమిటి సభ్యులు వేణుగోపాల్, నందగోపాల్, బీమ్ పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో ఎగిరేది బీఆర్ఎస్ జెండానే

ముషీరాబాద్: ఎవరు ఎన్ని మత రాజకీయాలు చేసిన, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎగిరేది గులాబీ జెండానేనని భారత జాగృతి ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ పరకాల మనోజ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. బుధవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసిఆర్ చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రజలు ఎప్పటికి ముఖ్యమంత్రి కేసిఆర్‌ను మరచిపోలేరన్నారు.

ముషీరాబాద్ బీజేపీ టికెట్ రాంరెడ్డికివ్వాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుల్జారెడ్డి, రాములు, నర్సింగరావు తదితరులు

చిక్కడపల్లి: ముషీరాబాద్ బీజేపీ టిక్కెట్‌ను ఉద్యమకారుడు రాంరెడ్డికివ్వాలని తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. 1996 నుంచి తెలంగాణ ఉద్యమంలో ఉంటూ ముషీరాబాద్‌లో ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడడానికి కారణమైన రాంరెడ్డికి బీజేపీ ముషీరాబాద్ టిక్కెట్‌కేటాయించి ఉద్యమకారులకు న్యాయం చేయాలని వారు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లిలోని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ అమరుల ఆసయసాధన జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ పాతదొడ్డి తుల్జారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వచ్చిందే అమరులు ఉద్యమకారుల పోరాటం వల్లనేన్నారు. టీఆర్ఎస్‌లో చేరి ఉద్యమాన్ని నడిపించిన ప్రఫుల్‌రాంరెడ్డి కేసీఆర్ కుటుంబపాలనతో విసిగి వేసారి బీజేపీలో చేరారన్నారు. రాంరెడ్డికి టిక్కెట్ కేటాయించి ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నారు. తెలంగాణ బీసీ వికాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బాసెట్టి నర్సింగరావు పాల్గొన్నారు.

గంగపుత్రులకు ఐదు స్థానాలు కేటాయించాలి

ముషీరాబాద్: గంగపుత్ర సామాజిక వర్గానికి రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు గంగపుత్రుల జనాభా దామాషా ప్రకారం ఐదు అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి డిమాండ్ చేశారు. బుధవారం కవాడిగూడలోని గంగపుత్ర సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా గంగపుత్ర ఓటర్లు 30లక్షలకు పైగా కలిగి ఉండి గెలుపు ఓటములను ప్రభావితం చేసే స్థాయిలో గంగపుత్రులు ఉన్నార న్న విషయాన్ని ప్రధాన పార్టీలు గుర్తుంచుకోవాలి. గంగపుత్రులకు అన్ని రాజకీయ పార్టీలు ప్రతి ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేసి మోసం చేయడం అలవాటుగా మారిందని రాబోయే ఎన్నికల్లో గంగపుత్రులకు జనాభా దమాషా పద్ధతిన టికెట్లు కేటాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గడప శ్రీహరి

19న మహాపాదయాత్ర ముగింపు సభ



కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ ఇన్‌చార్జీ గజ్జల రాజశేఖర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వచ్చే సీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ చేపట్టిన మాదిగల విశ్వరూపం మహాపాదయాత్ర ముగింపు సభ ఈ నెల 19న ఎల్‌బీనగర్‌లో నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ ఇన్‌చార్జీ గజ్జల రాజశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం రాంనగర్ డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లి, సుందరయ్య పార్కు, భగత్‌సింగ్‌నగర్ బస్తీలో పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణి చేశారు. కార్యక్రమంలో నాయకులు రాయపాటి రవిమాదిగ, ముచ్చనపల్లి రాములు, ఏకాసిరాజు, దశరథ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రవల్లిక ఘటనలో కక్షపూరితంగా కేసులు’

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రవల్లిక ఆత్మహత్య అనంతరం ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వద్ద రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్‌తో కలిసి ఆందోళన కార్యక్రమాలలో పాల్గొన్నందుకు తనపై కక్షపూరితంగా అక్రమ కేసులు పెట్టారని ఓయూ పరిశోధన విద్యార్థి, ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీలో జరుగుతున్న అవినీతి అక్రమాలు, గ్రూప్-1 పేపర్ లీకేజీ, రాత పరీక్షల రద్దు, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన తదితర అంశాలపై వరుసగా ఆందోళనలు చేస్తున్న తనను టార్గెట్ చేసి ప్రవల్లిక ఘటనలో శాంతియుతంగా ఆందోళనలో పాల్గొనందుకు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. పేదరికాన్ని ఆసరగా చేసుకొని అమాయకులైన ప్రవల్లిక కుటుంబానికి డబ్బు, ఉద్యోగాన్ని ఎరగా చూపి కేసును తప్పుదోవ పట్టించారని బీఆర్ఎస్ నేతలు ఓట్లతో పాటు ప్రాణాలను సైతం డబ్బుతో కొంటున్నారన్నారు. ప్రవల్లిక ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమైతే గతంలో అనేక మంది ప్రేమ విఫలమై ఆత్మహత్యలు చేసుకున్నారని వారి కుటుంబాలకు ఎందుకు సహకరించలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.



మాట్లాడుతున్న జీవన్

ఉచిత వైద్య శిబిరం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని కీస్ హైస్కూల్‌లో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వివేకానందపురం సికింద్రాబాద్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని పీఐడీ ఎల్ ఆర్ సునిల్ కుమార్, లయన్ దీపక్ బట్టాచార్జ్, లయన్ మల్లారెడ్డి ప్రారంభించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు ఆస్పత్రి మార్కెటింగ్ హెడ్ వినోద్ కుమార్ తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగే వైద్య శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో బుధవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో భాగంగా వినయ్ కుమార్ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. పుష్పాంజలి, శ్లోకాంజలి, జయ జయ దుర్గే, శ్రీలలిత హారతి, అన్నమాచార్య కీర్తనలను మంగిని, హాసిని, శ్రీనిధి, శ్రవ్య, ఆద్య, అంవక, ప్రియాంక, దాక్షిణ్య సాహితి తదితరులు ప్రదర్శించారు.